# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :264 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 01-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## కలుషిత నీరు తాగి ఎనిమిది మంది మృతి..

మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కలుషిత నీటి (ని తాగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. భగీరత్‌పుర కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 25 నుంచి 30 మధ్య ఈ మరణాలు నమోదయ్యాయి. డిసెంబర్ 25న మున్సిపల్ అధికారులు సరఫరా చేసిన కొళాయి నీటిలో ఓ విధమైన వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. ఆ నీటిని తాగి పలువురు అస్వస్థతకు గురవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఆ కాలనీకి చేరుకొని నీటిని పరిశీలించారు.నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ పరిస్థితి విషమించి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలవడంతోనే

## న్యూఇయర్ వేడుకల వేళ..సజ్జనార్ వార్నింగ్



హైదరాబాద్ : న్యూ ఇయర్ వేడుకల వేళ మందుబాబులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్ జారీ చేశారు. మద్యం సేవించి రోడ్లపైకి వస్తే..వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని 120 ప్రాంతాల్లో ఇవాళ రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయన్నారు. మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానా, వాహనాలను జప్తు, జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు రాత్రి ఎనిమిది గంటలనుంచే కొనసాగుతాయని తెలిపారు. తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని వెల్లడించారు. న్యూఇయర్ వేడుకలు అంతా సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ శాఖ కోరుతుందన్నారు.న్యూ ఇయర్ సందర్భంగా క్యాబ్ లేదా ఆటో డ్రైవర్లు రైడ్ రావడానికి నిరాకరించినా, బుకింగ్ ధర కంటే ఎక్కువ డబ్బులు డిమాండ్ చేసినా ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై మోటార్ వెహికల్ చట్టం సెక్షన్ 178(3) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే, వెంటనే హైదరాబాద్ పోలీస్ అధికారిక వాట్సాప్ నంబర్ o91 94906 16555 కు సమాచారం పంపించాలని సూచించారు.

హైదరాబాద్ లో రాత్రి 11నుంచి 2గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బుధవారం రాత్రి 11 గంటల నుంచి 2 గంటల వరకు ఆంక్షలు కొనసాగున్నాయి. ఇక బేగంపేట, టోలీచౌకీ ఫ్లైఓవర్ మినహా మిగతా ఫ్లైఓవర్లన్నీ రాత్రి 10 నుంచి జనవరి 1వ తేదీ ఉదయం వరకు అవసరం మేరకు బంద్ చేస్తామని సీసీ వెల్లడించారు. అన్ని ప్రైవేటు వాహనాలు సిటీలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు.ట్యాంక్‌బండ్, నెక్లస్ రోడ్ వంటి చోట్ల రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున రెండుగంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. 217 ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారని, ట్యాంక్‌బండ్, ఎన్‌టీఆర్ మార్గ్, నెక్లస్‌రోడ్ వంటి రద్దీ ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ ఉన్నచోట ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. ఫ్లైట్ టికెట్ ఉంటేనే పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పైకి అనుమతించనున్నారు. ర్యాష్ డ్రైవింగ్,ట్రాఫిక్ నిబంధనలకు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇండోపాక్ ఉద్రిక్తతలపై చైనా ప్రకటనను తిరస్కరించిన భారత్

న్యూఢిల్లీ, ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా ప్రకటించింది. చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టం చేసింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న జరిగిన కాల్పుల విరమణ.. రెండు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా కుదిరిందని వెల్లడించింది. 'మేము ఇప్పటికే అలాంటి వాదనలను తోసిపుచ్చాము. భారత్-పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి మూడో పక్షం ప్రమేయం లేదు. రెండు దేశాల డీజీఎమ్‌వోలు నేరుగా సంప్రదింపులు జరిపి కాల్పుల విమరణ ఒప్పందాన్ని అంగీకరించారు. ఈ విషయంపై గతంలో అనేక సందర్భాల్లో మా వైఖరిని స్పష్టం చేశాము' అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇండోపాక్ ఉద్రిక్తతలపై మధ్యవర్తిత్వం వహించాం.. చైనా

పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య చేపట్టింది. అయితే రెండు దేశాల డీజీఎంవోల చర్చల తర్వాతే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు భారత్ పేర్కొన్నది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఇరు దేశాల మధ్య సంధికి తానే కీలక పాత్ర పోషించినట్లు చెప్పుకుంటున్నారు. సుంకాల బెదిరింపులతో రెండు దేశాలు దిగొచ్చాయని ప్రపంచ వ్యాప్తంగా చాటింపు వేసుకుంటున్నారు. అయితే, ట్రంప్ ప్రకటనలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. పాక్‌తో జరిగిన సమరంలో మూడవ దేశ పాత్ర లేదని చెప్పింది. అయితే, ఇప్పుడు ట్రంప్ తరహాలోనే ఇండోపాక్ మధ్య శాంతిని



నెలకొల్పడంలో తాము కూడా పాత్ర పోషించినట్లు ఇప్పుడు చైనా చెప్పడం గమనార్హం.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంక్షోభాలను పరిష్కరించేందుకు శాంతిదూత పాత్రను చైనా పోషించినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యి పేర్కొన్నారు. ఇండోపాక్ యుద్ధమే కాదు మయన్మార్, కంబోడియా-థాయ్‌ల్యాండ్, ఇరాన్ న్యూక్లియర్ సమస్యను కూడా పరిష్కరించినట్లు చైనా మంత్రి చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో యుద్ధాలు, సీమాంతర దాడులు జరిగాయన్నారు. రాజకీయ అనిశ్చితి పెరిగిందన్నారు. శాంతి స్థాపన చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నామని, దీని కోసం ఆ సమస్యల మూలాలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశామన్నారు. బీజింగ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సిచ్యువేషన్ అండ్ చైనా ఫారిన్ రిలేషన్స్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలకు భారత్ తాజాగా కౌంటర్ ఇచ్చింది.

## అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పనులు చేశాం..

హైదరాబాద్,మన ఊరు మన బడి కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసానికి వచ్చిన మన ఊరు మనబడి కాంట్రాక్టర్లు తమ గోడు వెల్లబోసుకున్నారు. అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి వడ్డీలు కడుతున్నామని, కుటుంబాలు నడవడం కష్టంగా ఉందని చెప్పుకొచ్చారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మన ఊరు మన బడి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది..? తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు మన బడి కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారన్నారు.. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లులు రిలీజ్ చేసే రేవంత్ రెడ్డికి చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు కనిపించడం లేదా? కమీషన్లు రావు అని బిల్లులు ఇవ్వడం లేదా? మన ఊరు మన బడి కార్యక్రమానికి చెందిన రూ.512కోట్ల రెడీ ఫర్ పేమెంట్ ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.అసెంబ్లీ వేదికగా మన ఊరు మనబడి కాంట్రాక్టర్ల సమస్యలు లేవనెత్తుతానని ఈ సందర్భంగా హరీశ్ రావు వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు బాగు చేయాలని, తద్వారా అడ్మిషన్లు పెంచి పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని కేసీఆర్ ఆలోచిస్తే, రేవంత్ రెడ్డి ఆ లక్ష్యాన్ని నీరుగా అరుస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు.



బిల్లులు చెల్లించే వరకు బీఆర్ఎస్ పోరాటం..

మన ఊరు మన బడి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు హరీశ్ రావు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రికి రాష్ట్రంలో విద్య పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. గురుకులాల పిల్లలకు సరిగ్గా అన్నం కూడా పెట్టలేని చేతగాని సర్కారు అని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైపోతున్నారు. ఒకవైపు బ్యాంకు వడ్డీలు, మరోవైపు కార్మికుల జీతాలు, సరఫరాదారుల బాకీలు అన్ని కలిపి కాంట్రాక్టర్లపై తీవ్రమైన ఒత్తిడి పడుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్లను పట్టించుకోకపోవడం, చేసిన పనులకు సకాలంలో చెల్లింపులు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు.

## కేసీఆర్ సంచలనం : కేటీఆర్ ను కాదని హరీష్ రావుకు పగ్గాలు?



హైదరాబాద్,కేసీఆర్.. రాజకీయ చాణక్యుడు.. ఎప్పుడు ఎవరిని ఎలా కొట్టాలో ఆయనకు తెలుసు. ఎవరికి ఎప్పుడు బాధ్యతలు అప్పగించాలో ఆయనకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియదు. సమయం, సందర్భంను బట్టి రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడంలో సిద్ధహస్తుడు. అలాంటి కేసీఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడు కేటీఆర్ ని కాదని.. మేనల్లుడు హరీష్ రావుకు తన తర్వాత బాధ్యతలు అప్పగించడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న తాజా నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. అసెంబ్లీ లో పార్టీ గళాన్ని వినపించే బాధ్యతలను న మేనల్లుడు హరీష్ రావుకు అప్పగిస్తూ కుమారుడు కేటీఆర్ ను ఈ జాబితాలో చేర్చకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైం ది.తెలంగాణ అసెంబ్లీలో ప్రతిపక్షంలో మరింత దూకుడు పెంచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శాసనసభ, శాసనమండలిలో పార్టీ పదవులను భర్తీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నియామకా లలో సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావుకు అత్యంత ప్రాధాన్యత దక్కగా.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా 'ట్రబుల్ షూటర్'

అసెంబ్లీలో కేసీఆర్ బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేతగా కొనసాగుతుండగా.. ఆయనకు సహాయకులుగా ముగ్గురు ఉప ఫ్లోర్ లీడర్లను నియమించారు. సభలో విషయ పరిజ్ఞానం, వాక్చాతుర్యం కలిగిన హరీష్ కు కీలక బాధ్యతలు అప్పగించారు. మహిళా గళాన్ని వినిపించేందుకు మాజీ మంత్రి సబితకు అవకాశం ఇచ్చారు. గట్టిగా వాదించగల నేతగా తలసానికి చోటు కల్పించారు.

కేటీఆర్ ఎందుకు లేరు?

పార్టీలో నంబర్ 2గా చలామణి అవుతున్న కేటీఆర్ పేరు ఈ జాబితాలో లేకపోవడంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్ ఇప్పటికే పార్టీ వర్కింగ్ గా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ వ్యవహారాలను.. క్షేత్రస్థాయి క్యాడర్ ను సమన్వయం చేసుకునే బాధ్యతల్లో ఉన్నారు. అందుకే ఆయనను కేవలం అసెంబ్లీ బాధ్యతలకు పరిమితం చేయకూడదని కేసీఆర్ భావించి ఉండవచ్చు.

హరీష్ అనుభవంపై నమ్మకం..

అసెంబ్లీ నిబంధనలు.. బడ్జెట్ అంశాలు.. ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టడంలో హరీష్ రావుకున్న అనుభవం ఇక్కడ కలిసి వచ్చింది. గత కొన్ని సెషన్లలో హరీష్ రావు ఒంటరిపోరాటం చేసిన తీరు కేసీఆర్ ను మెప్పించిందని సమాచారం. పార్టీలో పట్టు కోల్పోకుండా ఉండటానికి హరీష్ రావుకు అసెంబ్లీలో, కేటీఆర్‌కు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ప్రాధాన్యతనిస్తూ కేసీఆర్ బ్యాలెన్స్ చేస్తున్నారా? అనే సందేహాలు మొదలయ్యాయి.శాసనమండలిలో కూడా పార్టీ పట్టు కోల్పోకుండా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలను ఉప నేతలుగా దేశపాటి శ్రీనివాస్‌ను పార్టీ విప్‌గా నియమించారు. మండలి ఫ్లోర్ లీడర్‌గా ఎస్. మధుసూదనాచారి యథావిధిగా కొనసాగుతారు.మొత్తానికి హరీష్ రావుకు అసెంబ్లీలో కీలక బాధ్యతలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వంపై మరింత పదునైన విమర్శలు చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. కేటీఆర్ పేరు లేకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందా లేక ఇది కేవలం పని విభజనలో భాగమేనా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

## మేడారం మహా జాతరకు భారీగా తరలివస్తున్న భక్తులు



ములుగు:ములుగు జిల్లాలోని మేడారం అప్పుడే ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వచ్చే నెల (జనవరి) 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు ముందే భక్తులు మేడారానికి క్యూ కడుతున్నారు. జాతర సమయంలో ఉండే విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్నవారు, వృద్ధులు ఇప్పుడే వచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. మేడారానికి తరలివస్తున్న భక్తులు తమ బరువుకు తూగేలా 'బంగారం' (బెల్లం) తూచి గద్దెల వద్ద సమర్పిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లులకు ఎదురోళ్లు, యాట మొక్కులతో తమ భక్తిని చాటుకుంటున్నారు. మేడారంతో పాటు చుట్టుపక్కల 40 కిలోమీటర్ల మేర ఉండే ప్రతి చెట్టు, పుట్టను అమ్మవార్ల ప్రతిరూపంగా భావించడం ఇక్కడి విశేషం. జాతర సమయంలో అడవిలోని వన్యప్రాణులు భక్తులకు ఎలాంటి హాని చేయవనేది తరతరాలుగా వస్తున్న నమ్మకం. ఈసారి జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.251 కోట్లతో భారీ అభివృద్ధి పనులు చేపట్టింది. గద్దెల ఆధునికీకరణ, విశాలమైన క్యూలైన్లు, రాతి కట్టడాలు, రహదారుల విస్తరణతో మేడారం సరికొత్తగా కనిపిస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తలస్నానాల కోసం జంపన్న వాగు వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

### కొత్త సంవత్సరంలో కేబినెట్ భేటీ

అమరావతి, కొత్త సంవత్సరంలో ఏపీ మంత్రి మండలి సమావేశం జనవరి 8న జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు సంబంధించి ఆయా శాఖలు తమ ప్రతిపాదనలను జనవరి 6వ తేదీ సాయంత్రం 4:00 గంటలలోపు సమర్పించాలని మెమో జారీ చేశారు.

## హిందూ ధర్మం, సనాతన ఆచారాలకు లోటు జరిగితే సహించం

నెల్లూరు, డిసెంబర్ 31: కోనసీమ జిల్లా ద్రాక్షారామంలోని బీమేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని ధ్వంసం చేయడం ద్వారా హైందవుల మనోభావాలు దెబ్బదీశారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. సీసీ కెమెరా ఆధారంగా దోషులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నెల్లూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవి చంద్ర, స్థానిక లోక్‌సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి తనని గుర్తు పట్టకుండా.. ముఖాన్ని దాచుకొని వచ్చినట్టు నిర్ధారణకు అధికారులు వచ్చారన్నారు. ఆలయంలో వ్యక్తిపై ఉన్న కోపాన్ని ఇలా విధంగా చూపినట్టు గుర్తించారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ శివలింగన్ని ఏర్పాటు చేసి పూజలు జరిపించారని వివరించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు.ఇక నంద్యాలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దేవుడి అలంకరణ కోసం వినియోగించే వస్తువులు నకిలీ వెండి వస్తువులని తేలిందన్నారు. వెండి ఆభరణాలు.. ఎలా నకిలీ వస్తువులుగా మారాయనే దానిపై విచారణ జరిపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసులు నమోదు చేయాలని ఇప్పటికే ఎండోమెంట్ అధికారులకు ఆదేశించామని గుర్తు చేశారు.సింహాచలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రసాదం తయారీ కౌంటర్లో తప్పు చేసిన వ్యక్తిపై చర్యలకు ఇప్పటికే ఆదేశించామని వివరించారు. ప్రసాదంపై భక్తుల ఆరోపణలకి స్పందించాల్సిన అధికారి.. వారిపై దురుసుగా ప్రవర్తించడం కరెక్ట్ కాదన్నారు. హిందూ ధర్మం, సనాతన ఆచారాలకు లోటు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన హెచ్చరించారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా గత ఏడాది వైష్ణవ ఆలయాలను 5.5 లక్షల మంది భక్తులు దర్శించుకుంటే... ఈ ఏడాది 7.5 లక్షల మంది ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారని గణాంకాలతో సహా వివరించారు. ప్రజల్లో



ఆధ్యాత్మికంపై నమ్మకం పెరుగుతుంది. ఇది ప్రభుత్వ పాలనకు అద్దం పడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. తిరుమలలో మంగళవారం ఆన్ లైన్ ద్వారా అవకాశం పొందిన 75 వేల మంది ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారన్నారు.రామరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పెద్ద పీట వేస్తున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటిని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పునరుద్ఘాటించారు. రాష్టంలో అభివృద్ధి, సంక్షేమం.. రెండు ఒకదానితో మరొకటి పోటీపడుతున్నారు. ప్రజలకి రూ. వేల కోట్లు అనేక పథకాలు ద్వారా పంపిణీ చేశామన్నారు.ఏఎస్ పేటలో అభివృద్ధి జాతర జరుగుతోందని ఎంపీ వీపీఆర్ తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడే కనిపించలేదని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఒక రోజు ముందే సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీ చేశారని వివరించారు. ఆర్థికలోటు ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోటీ పడి అభివృద్ధి చేస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవి చంద్ర తెలిపారు. ప్రతిపక్ష పార్టీ కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ దుష్ప్రచారం సాగిస్తుందని వైసీపీపై మండిపడ్డారు.

## వాళ్ల తరహాలో భూపోరాటాలు చేస్తా : కవిత వాళ్ల తరహాలో భూపోరాటాలు చేస్తా

కరీంనగర్: తెలంగాణ ఉద్యమకారులతో కలిసి భూపోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇంటి స్థలాల విషయంలో డిసెంబర్ 9లోగా నెరవేర్చకుంటే భూ పోరాటాలు చేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో భూపోరాటాలకు శ్రీకారం చుట్టామన్నారు. కమ్యూనిస్టుల తరహాలో భూపోరాటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ఇప్పటికే కవిత జాగృతి జనంబాట యాత్ర పేరుతో గ్రామాలలో



పర్యటన చేస్తున్న విషయం తెలిసిందే.

## సంపాదకీయం

గురువారం 01-01-2026

# రైతులకు కలిసి రాని కాలం

పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు ఇలా అనేక చోట్ల దగాపడుతూనే ఉన్నారు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్య. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంతో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐ పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెకెమోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనల రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితిలో గ్రామాల్లో ప్రైవేటే వ్యాపారులకు అమ్ముతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్మకుస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు. పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కొనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారులకు పెత్తనమే సాగింది. క్వింటాలుకు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.6000 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నదీ లేదు. అరటికాయలు మార్కెట్కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది

# తుపాకీ నీడలో మయన్మార్ ఎన్నికలు



న్యూఢిల్లీ,ఎన్నికల ప్రజాస్వామ్యం ప్రధాన లక్ష్యం ప్రజాప్రాతినిధ్యం ద్వారా పాలనా వ్యవస్థను నెలకొల్పడమే. అలా కాకుండా ప్రజలను అణగదొక్కడానికి, తమ అడుగులకు మడుగులొత్తుతున్న పరమ విధేయులను అభ్యర్థులుగా పోటీకి నిలబెట్టడం నిజంగా అత్యంత మోసపూరిత ఎన్నికల ప్రహసనమే అవుతుంది. అంగ్‌సాన్ సూకీ తదితర నేతలు ఇంకా జైలు లోనే మగ్గుతుండగా, 40 కి పైగా రాజకీయ పార్టీలను జుంటా నిషేధించింది. జుంటా నిర్వహించిన జనాభా గణన ప్రకారం దేశం లోని 5.1 కోట్ల మందిలో దాదాపు 1.9 కోట్ల మంది వివరాల సేకరణే జరగలేదు. ఇప్పుడు మయన్మార్‌లో మూడు దశలుగా జరుగుతున్న ఎన్నికలు ఈ పరిస్థితికి దర్పణం పడుతున్నాయి. చైనా, రష్యా, బెలారస్ ఈ ఎన్నికలకు మద్దతు ఇవ్వడంలో అనేక వ్యూహాత్మక, భౌగోళిక, వాణిజ్య, సామ్రాజ్య విస్తరణ అంశాలు ముడిపడి ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు సరైన ఫలితాలు ఇవ్వవని ప్రజలు ఇష్టపడకపోయినా ఓటు వేయాలంటూ తుపాకీ తో జుంటా ప్రభుత్వం బెదిరిస్తోంది. ఒక విధంగా తుపాకీనీడలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పవచ్చు. మయన్మార్ సైనిక అధికారులు ఓటు వేయాలని ప్రజలను బలవంతం చేయడానికి బెదిరించడం, హింసించడం ఆపాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ సంచలన ప్రకటన చేయడం పరిశీలిస్తే మయన్మార్ ఎన్నికలు ఎలా జరుగుతున్నాయో అంచనా వేయవచ్చు. ఐదేళ్ల క్రితం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కుప్పకూలదోసి అంతర్యుద్ధాన్ని తెరపైకి తీసుకు వచ్చిన మిలిటరీ 'జుంటా' నేతృత్వంలోనే ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య పాలనకు జుంటా ఎంతవరకు పట్టం కడుతుందో అందరికీ తెలిసిందే. 2021 ఫిబ్రవరిలో జరిగిన సైనిక తిరుగుబాటు మయన్మార్ ప్రజల ఆశలను అడుగంటించి అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూల్చివేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో ఎన్నికలు జరిపిస్తుండటం మరింత శక్తిని కూటగట్టుకునేందుకే అన్నది జగమెరిగిన సత్యం. మూడు దశల్లో తొలిదశ 102 టౌన్‌షిప్‌లకు పోలింగ్ డిసెంబర్ 28న జరిగింది. తరువాత రెండో దశ పోలింగ్ జనవరి 11న 100 టౌన్‌షిప్‌లకు, మూడోదశ పోలింగ్ జనవరి 25న 63 టౌన్‌షిప్‌లకు జరగనుంది. 2020 నాటి ఎన్నికల్లో పాల్గొన్న ఇప్పుడు చెరసాలలో బందీగా ఉన్న నాయకురాలు అంగ్‌సాన్ సూకీ నేతృత్వం లోని విజేత పార్టీ నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్‌ఎల్‌డీ)తోసహా ప్రధాన పార్టీలేవీ ఈసారి పోటీలో లేకపోవడం ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. మాజీ జుంటా ప్రతినిధులతో కూడిన యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) ఒక్కటే ఒక దళంగా పోటీలో ఉంది. ఇది 2008 రాజ్యాంగం నీడలో నిర్వహించిన 2010 నాటి ఎన్నికల చిత్రాన్ని ప్రతిబింబిస్తోంది. ఆనాడు ఎన్‌ఎల్‌డి ఎన్నికలను బహిష్కరించింది. యుఎస్‌డిపి ఒక్కటే గెలుపొందింది. కానీ ఇప్పుడు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. గత ఐదేళ్లుగా జుంటా సైనిక ప్రభుత్వం బాంబు దాడులతో వేలాది మంది పౌరులను బలిగొంది. 1960 నుంచి సైనిక ప్రభుత్వం తీవ్ర ప్రజాపోరాటాలను ఎదుర్కొంటోంది. సాయుధగ్రూపులు, ఎన్‌ఎల్‌డి అనుబంధ పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్ (పిడిఎఫ్), విపక్ష నేషనల్ యూనిటీ గవర్నమెంట్‌కు విధేయులైన, ఎన్‌ఎల్‌డి బహిష్కరించిన, వర్గాలు మయన్మార్‌లో చెప్పుకోదగిన భూభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. 2023 ఆఖరులో చైనా ఆయుధ సాయంతో త్రీబ్రదర్ హుడ్ అలియన్స్ (టిబిఎ) అనే సంకీర్ణ కూటమి చైనా సరిహద్దు లోని టౌన్‌షిప్‌లతో సహా షాన్ రాష్ట్రం, రఖైన్ తదితర టౌన్‌షిప్‌లను చేజిక్కించుకోవడం జుంటాకు గట్టిదెబ్బ. 2025లో చైనా వైఖరి మార్చుకునే వరకు జుంటాకు రష్యా, బెలరూసియన్ ఆయుధ సాయం అందేది. భౌగోళిక, ఆర్థిక ప్రాధాన్యతలతోపాటు హిందూ మహాసముద్ర తీర ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని చైనా జుంటాకు వెన్నుదన్నుగా నిలిచింది. చైనా ఒత్తిడితో శత్రుత్వాలను ఆపి తిరిగి జుంటాకే అధికారం దక్కేలా చేసింది. అయినా జుంటా రఖైన్, కరెన్నీ, కరెన్, చిన్ రాష్ట్రాల్లో తిరుగుబాటు పోరాటాలను తరుచుగా ఎదుర్కోవలసి వస్తోంది. సాగాయింగ్ రీజియన్‌లో జుంటాకు ఏమాత్రం నియంత్రణ లేని మొక్కుబడి పెత్తనమే మిగిలింది. మయన్మార్‌లోని సగం కంటే ఎక్కువ భాగం ప్రస్తుత సైనిక నియంత్రణలో లేదు. వివిధ జాతుల సాయుధ బలగాలు, పీపుల్స్ డిఫెన్స్‌ఫోర్స్‌లతో జుంటా అనేక ప్రతిఘటనలను ఎదుర్కొంటోంది. మయన్మార్ రాజధాని నుంచి, జుంటా అధీనంలో ఉన్న భూభాగాల నుంచి వస్తున్న విశ్లేషణలు పరిశీలిస్తే 2020 కన్నా ఇప్పుడు ప్రజా పార్టీల ప్రాతినిధ్యం చాలా వరకు తక్కువే అని తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతాల్లో ఈ ఎన్నికల ద్వారా గెలుపు పొందడానికి, అలాగే తమ పాలనకు చట్టబద్ధత సాధించాలన్నదే జుంటా తాపత్రయం. తాను అనుకున్నది నెరవేరకుంటే అంతర్యుద్ధంతో అల్లకల్లోలం సృష్టించి రక్తపాతానికైనా జుంటా సాహసిస్తుంది. టిన్‌పాట్ నాయకుడు మిన్ అంగ్ హ్లైంగ్ నేతృత్వంలోని జుంటా సైనిక ప్రభుత్వం ఇంతవరకు ఎన్నికలు కాని శాసనసభ స్థానాల్లో కనీసం 25% అయినా రాజ్యాంగబద్ధంగా దక్కించుకుంటాదన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఫలితాలతో సంబంధం లేకుండా సైన్యం ఆధిపత్యమే చెలాయిస్తుందని భావిస్తున్నారు. కానీ చరిత్ర ఒక మార్గదర్శకంగా ఉంటే బూటకపు బెదిరింపు ఎత్తుగడలతో నిర్వహిస్తున్న ఈ ఎన్నికలు ప్రజల మద్దతును పొందలేవు. అలాంటి వ్యతిరేక ఫలితాలు వస్తే మయన్మార్ మరిన్ని సంక్లిష్ట సంఘర్షణలకు సిద్ధం కావలసి వస్తుంది.

# వేడెక్కుతున్న బెంగాల్ రాజకీయం

బెంగాల్,పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం ఒక నిర్ణయాత్మక రాజకీయ పర్వంలో ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమవుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 2011లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించినన తర్వాత తొలిసారిగా రాష్ట్ర రాజకీయ వాతావరణం కాస్త గందరగోళంగా, అస్థిరంగా ఉంది. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఎదురులేదు. ఆమె వ్యక్తిత్వం, మార్పు తీసుకువస్తానన్న ఆమె వాగ్దానం చుట్టూ తిరిగిన రాజకీయ కథనం ప్రస్తుతం మరింత గందరగోళాన్ని ప్రతిబింబిస్తోంది. 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఎంసి సర్కార్‌కు ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగానే ఉంది. ఇక బిజెపి రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దాదాపు కనుమరుగైన స్థితినుంచి వామపక్షాలు కోలుకుని కాస్త తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక కోల్‌కతా సివిల్ పోల్స్ ఫలితాలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షోలు సంస్థాగత జోక్యం, రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో మారుతున్న రాజకీయ సెంటిమెంట్లు రాబోయే ఎన్నికల ఫలితాలు 2021 మాదిరిగా ఉండబోవని సూచిస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో రాజకీయచిత్రం మారవచ్చు. త్రిముఖ పోటీలే ఉండవచ్చు. ప్రతి పార్టీ మరో పార్టీతోనే కాక, సొంత పార్టీలో తిరుగుబాటుదారులతో గట్టి పోటీ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చు. మమతా బెనర్జీ పార్టీ ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సవాల్ ప్రజల విశ్వాసం దెబ్బతినడం. 15 ఏళ్ల పాలన ప్రభుత్వ వ్యతిరేకతనే కాదు పాలకులకు అలసటను కూడా తెస్తుంది. ప్రభుత్వ నియామకాల్లో అవినీతి ఆరోపణలు, స్థానిక విద్యుత్ బ్రోకర్లపై పెరుగుతున్న ఆగ్రహం, సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీలో రాజకీయ జోక్యంపై ఆందోళనలు ఉండనే ఉన్నాయి. ఒకప్పుడు భావోద్వేగశక్తిగా, విప్లవాత్మకంగా భావించిన మా మాటీ –మనుష్ కథనం ఆరోపణలకు కేంద్రంగా మారింది. అధికార వికేంద్రీకరణ వల్ల కొన్ని చోట్ల నియంత్రణ మరింత కఠినంగా మారింది. అయినా, బెంగాల్‌లో ప్రభుత్వ వ్యతిరేకత అంత తీవ్ర స్థాయిలో లేదు. వ్యవస్థపై అసంతృప్తి ఉన్నా, మమతా బెనర్జీని తిరస్కరించే అంతగా మారలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా మమతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్మీ భండార్, కన్యశ్రీ, స్వాస్థ్య సతి, రూపశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆమెకు వ్యక్తిగతంగా తిరిగి అధికారం అందించే గ్యారంటీగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమాలు విధానపరమైనవే కాక, సామాజిక సంబంధాలను పెంచడంలో కీలకంగా పని చేస్తాయి. లబ్ధిదారుల నెట్‌వర్క్‌ను సృష్టించి, పాలనను అంచనా వేసేందుకు తోడ్పడతాయి. అందుకే బెంగాల్‌లో ఉన్న సెంటిమెంట్ ప్రభుత్వంలో మార్పును డిమాండ్ చేసే స్థాయిలో లేదు. టిఎంసి ప్రభుత్వం స్థానిక నాయకత్వంపై వస్తున్న ఆరోపణలను చక్కదిద్ది, సజావుగా సంక్షేమం అందేటట్లు చూడగలమని ఒప్పించాలి. ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. మమతా బెనర్జీ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించి, అధికారం తిరిగి చేజిక్కించుకునేందుకు తగిన విధంగా మార్చగలరా అన్నదే అధికార పార్టీ ఎదుర్కొంటున్న ప్రశ్న. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సంక్లిష్టతకు తగిన సమాధానం దొరికింది. టిఎంసి విజయం సాధించి మహా నగరంపై తన నియంత్రణ నిలుపుకుంది. పాలక పార్టీకి ప్రస్తుతానికి ముఖ్యమైన ఆధిక్యత లభించింది. కోల్‌కతా కేవలం ఓ నగరం కాదు. రాజకీయంగా బలమైన ఘనమైన అడ్డా. దానిని నిలుపుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో విమర్శలు, ఎన్నికలలో ఓటర్ల మద్దతు తగ్గుతుందన్న వాదనలో అర్థం లేదనే ప్రభుత్వ ధీమాకు బలం చేకూరింది. బిజెపికి సంబంధించినంత వరకూ స్థానిక ఎన్నికలు ఆ పార్టీ సంస్థాగత లోపాలను బయటపెట్టాయి. గత పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ దీటైన బలాన్ని ప్రదర్శించినా, నగర రాజకీయాల యంత్రాంగంలో తనను మమేకమైపోయేందుకు చేస్తున్న కృషిలో అది చాలా కష్టపడింది. వార్డు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం కాకపోవడం అభ్యర్థుల ఎంపికలో లోపాల వల్ల బిజెపి చెప్పినంత బలంగా తనను తాను నిరూపించుకోలేకపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్



షా పదేపదే పర్యటనలు, రోడ్ షోలు, ఘనమైన ప్రసంగాలు, ఈ లోపాన్ని సవరించడమే లక్ష్యంగా పెట్టుకుని సాగాయి. బెంగాల్‌ను కైవసం చేసుకోవడం తమ పరిధికి మించిన పనిగా అంగీకరించేందుకు బిజెపి ఇష్టపడడం లేదని ఆయన ఉనికి సూచిస్తోంది. ఈ రోడ్ షో వల్ల రెండు ప్రయోజనాలు. అవి పార్టీ కేడర్‌ను ఉత్తేజపరుస్తాయి. కేంద్ర నాయకత్వం తమకు రాష్ట్రంలో అండగా ఉందని మద్దతుదారులకు భరోసా కల్పిస్తాయి. అయినా, రాష్ట్రంలో నమ్మకమైన నాయకత్వం నిర్మాణంలో, అంతర్గత వర్గ వివాదాలు, అస్థిరతను చక్కదిద్దడంలో ఇటువంటి ప్రయోగాలు ఏమాత్రం పనిచేస్తాయనే ప్రశ్న మిగిలే ఉంది. బిజెపి ప్రచారం ఎక్కువగా శాంతి భద్రతలు పరిరక్షణ, రాజకీయ హింసను నిర్మూలన, సుస్థిరమైన పాలన వంటి వాగ్దానాలకే పరిమితమైంది. అయితే, దానిని విజయం అది ఏ మేరకు బెంగాల్ నిర్దుష్ట మోడల్ పాలన అందించగలదనే అంశంపైనే ఆధారపడి ఉంది. మరో పక్క, లెఫ్ట్‌ఫ్రంట్ ఆచీతూచి అడుగులు వేస్తూ తన బలాన్ని పెంచుకునే స్థితిలో ఉంది. దీనిని పునరుజ్జీవనం గా అనలేం కానీ, పూర్తిగా తోసిపుచ్చలేం. కోల్‌కతా, అనేక జిల్లాలలో లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్ల షేర్ మెరుగైంది. టిఎంసి, బిజెపి రెండింటి పట్ల భ్రమలు కోల్పోయిన ఒక వర్గం పాలక పక్షానికి ప్రత్యామ్నాయంగా కాకుండా రాజకీయ శూన్యం భర్తీ చేసేదిగా వామపక్షం వైపు చూస్తోంది. చాలామంది యువకులు, యువ ఓటర్లు, ముఖ్యంగా విద్యార్థులు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు వామపక్షాల వైపు మొగ్గుచూపుతున్నారు. వామపక్షం పాలనలో నిబద్ధతతో పని చేసిన పాలనా వ్యవస్థలను జ్ఞప్తి చేసుకుంటున్నారు. వామపక్షాలు గతంపై ఆధారపడకుండా, నిరుద్యోగం, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఆందోళనలను ఎదుర్కొంటున్న ఈ తరానికి తమ పాలన ఎలా ఉంటుందో వ్యక్తపరచి, నచ్చచెప్పడం, సందర్భోచితంగా మారడం అవసరం. 2026 ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభంజనం వచ్చే అవకాశం లేనందున, సంప్రదింపులే కీలకం కాగలవు. సంఖ్యాపరంగా, సంస్థాగత కోణంలోనే కాక, పాలనాపరంగా టిఎంసి అధికారం వల్ల సంక్రమించిన ప్రయోజనాన్ని నిలుపుకుంటుంది. మమతా బెనర్జీ వ్యక్తిగత చరిష్మా, వ్యక్తిగతంగా ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నాయకత్వం, సంక్షేమ పథకాలు ఆ పార్టీకి కొండంత బలం. బిజెపికి కేంద్రంలో జాతీయ స్థాయిలో అధికారం వల్ల ప్రయోజనం. ఎన్నికలను ఓ సైద్ధాంతిక పోరుగా మార్చే సామర్థ్యం, సమృద్ధిగా ఆర్థిక పరమైన వనరులు, మార్పు తీసుకు వస్తామని చేస్తున్న వాగ్దానం, ప్రజలను ఒప్పించే సామర్థ్యం అండగా నిలవవచ్చు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పరమైన వాదన కన్నా, నైతికపరమైన భరోసా కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. రాజకీయంగా తెరమరుగయ్యారని భావించే ఓటర్లకు, తక్షణ విజయం కోసం కాకపోయినా,ఆ రెండు పక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేయాలనుకునే వారికి తగిన ప్రత్యామ్నాయంగా నిలిచే అవకాశం ఉంది. బెంగాల్ ఓటర్లు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బెంగాల్ లో రాజకీయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఎవరు ఎవరిని ఓడించగలరు అని కాదు. ఎవరు విశ్వసనీయమైన పాలన అందించగలరు అన్నదే. టిఎంసి ఓటర్లను గతంలో మాదిరిగానే ఆదరించమని అడుగుతోం

# కేంద్రం సంచలన నిర్ణయం..

న్యూఢిల్లీ,త్రివిధ దళాలను ఆధునికీకరించేందుకు, స్వయం సమృద్ధి దిశగా ముందుకు వెళ్లేందుకు రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. త్రివిధ దళాల సామర్థ్యాలను పెంచేందుకు రూ.79 వేల కోట్ల ప్రతిపాదనలకు DAC ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన రక్షణ సేకరణ మండలి (సమావేశం జరిగింది. సీడీఎస్,త్రివిధ దళాధిపతులు, రక్షణ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. త్రివిధ దళాలకు చెందిన ఆయుధ సేకరణ ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ నిర్ణయంతో భారత సైనిక బలగాల సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. భారత సైన్యం కోసం ఆర్టిలరీ రెజిమెంట్లకు లోయిటర్ మ్యూనిషన్ సిస్టమ్‌లో లెవల్ లైట్ వెయిట్ రాడార్లు, పినాకా మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్ కోసం లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ అమ్యూనిషన్, ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ , ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ Mk-IIల సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. టార్గెట్లపై ఖచ్చితమైన దాడులకు లోయిటర్ మ్యూనిషన్ టాక్టికల్ ఉపయోగపడనున్నాయి. చిన్న పరిమాణంలో, తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లను గుర్తించి ట్రాక్ చేయనున్నాయి. లెవల్ లైట్ వెయిట్ రాడార్లు.. ఖచ్చితత్వాన్ని పెంచి కీలకమైన టార్గెట్లను సమర్థవంతంగా ధ్వంసం చేయనున్న లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్లు పినాకా సిస్టమ్ రేంజ్ సైన్యానికి అందుబాటులోకి రానుంది. టాక్టికల్ బ్యాటిల్ ఏరియా, హింటర్‌ల్యాండ్‌లోని కీలక ఆస్తులను రక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ సిస్టమ్ ఉపయోగపడనుంది. భారత నావికాదళం కోసం బొల్లార్డ్ పుల్ టగ్స్, హై ఫ్రీక్వెన్సీ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోస్ యాన్‌ప్యాక్, హై ఆల్టిట్యూడ్ లాంగ్ రేంజ్ రిమోట్‌లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ లీజింగ్‌కు డీఏసీ ఆమోదం తెలిపింది. నావికాదళ నౌకలు, సబ్‌మెరైన్‌లను హార్బర్‌లో బెర్తింగ్, అన్‌బెర్తింగ్, మాన్యూవరింగ్‌లో BP టగ్స్ సహాయపడనున్నాయి. బోర్డింగ్, ల్యాండింగ్ ఆపరేషన్లలో సురక్షిత కమ్యూనికేషన్‌ను HF SDR వ్యవస్థలు మెరుగుపరచన్నాయి. భారత సముద్ర జలాల్లో నిరంతర ఇంటెలిజెన్స్, సర్వైలెన్స్, రెకనైసెన్స్ విశ్వసనీయ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్‌ను HALE RPAS అందించనున్నాయి. భారత వాయుసేన కోసం ఆటోమేటిక్ టేక్–ఆఫ్ ల్యాండింగ్ రికార్డింగ్ సిస్టమ్, ఆస్ట్రా Mk-II మిస్సైల్స్, ఫుల్ మిషన్ సిమ్యులేటర్, SPICE–1000 లాంగ్ రేంజ్ గైడెన్స్ కిట్స్ సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. ఏరోస్పేస్ సేఫ్టీలోని లోపాలను పూరించి, అన్ని వాతావరణ పరిస్థితుల్లో హై డెఫినిషన్ రికార్డింగ్‌ను ఆటోమేటిక్ టేక్–ఆఫ్ ల్యాండింగ్ రికార్డింగ్ సిస్టమ్ అందించనుంది. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల సామర్థ్యాన్ని పెంచి, దూరం నుంచే శత్రు విమానాలను నాశనం చేయనున్న మెరుగైన రేంజ్‌తో ఆస్ట్రా Mk-II మిస్సైల్స్ వాయుసేనకు అందుబాటులోకి రానున్నాయి. పైలట్ల శిక్షణను ఖర్చు తగ్గించి, సురక్షితంగా శిక్షణను మెరుగుపరిచేందుకు లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ ఫుల్ మిషన్ సిమ్యులేటర్ అందుబాటులోకి రానుంది. సుదూర ప్రాంతాల్లో ఖచ్చితమైన దాడి సామర్థ్యాన్ని పెంచేందుకు SPICE–1000 వాయుసేనకు అందుబాటులోకి రానుంది.

# జీవో 252తో జర్నలిస్టులకు అన్యాయం

హైదరాబాద్, అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల

గోదావరిఖని, సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతున్న.. ఆ విషయంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణి నిధుల దుర్వినియోగంపై సంస్థకు రావాల్సిన బకాయిలపై సింగరేణి సంస్థ ద్వారా పూర్తి వివరాలతో కూడిన శ్వేత పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలు పరిష్కారం చేయలేదని సింగరేణి సంస్థ నిర్వీర్యం అవుతున్న పట్టించుకోవడంలేదన్నారు. ఇవి చాలదన్నట్లు టీబీజీకేఎస్ పై నోరు పారేసుకుంటూ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు నూనె కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వారికి రూ.75వేలు.. తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తుంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ట్రాన్స్ జెండర్ ల ఆర్థిక సాధికారత పైన దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం వారు గౌరవంగా జీవించడం కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తుంది.ట్రాన్స్ జెండర్ లకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి నూటికి నూరు శాతం సబ్సిడీతో రుణాలను ప్రకటించింది.

75వేల రూపాయలు వంద శాతం సబ్సిడీతో ఋణం

దీంతో వారు ఏవైనా చిన్నపాటి వ్యాపారాలు చేసుకోవడానికి వీలు కలుగుతుంది.సమాజంలో ట్రాన్స్ జెండర్ లు చాలామంది వారికి సరైన ఆదరణ లేక, ఉపాధి కల్పన లేక రైళ్లలో, బస్టాండ్ల వద్ద ప్రయాణికుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే ఈ ప్రాక్టీస్ కు చెక్ పెట్టాలని భావించిన తెలంగాణ ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించడం కోసం 75 వేల రూపాయల వరకు రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది.

వీరికే అర్హత

2025- 2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రుణానికి పూర్తిస్థాయిలో అంటే నూటికి నూరు శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఇది లబ్ధిదారులకు ఎంతో చేయూతను అందిస్తోంది. అయితే ప్రభుత్వం అందించే ఈ పథకానికి 18 ఏళ్ల నుండి 55 ఏళ్ల మధ్య వయసు ఉన్న ట్రాన్స్ జెండర్ లకు , ఏదైనా రంగంలో శిక్షణ పొంది సొంతంగా చిన్న వ్యాపారాలను ప్రారంభించాలి అనుకునే వారికి ఈ రుణాలు అందించబడతాయి.

గౌరవంగా బ్రతికే ఛాన్స్ క్రియేట్ చేసిన ప్రభుత్వం

తద్వారా వారు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఆసక్తికర అర్హులైన ట్రాన్స్ జెండర్ లు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువ పత్రాలతో నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్ లోని సంబంధిత కార్యాలయంలో సమర్పించవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 31వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈ దరఖాస్తు ఫారాన్ని www.wdsc. telangana.gov.in నేరుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈ పథకం కింద లబ్ధి పొందే ట్రాన్స్ జెండర్ లు గౌరవంగా బ్రతకడానికి కావలసిన సహకారాన్ని పొందవచ్చు.

# కింగ్ మేకర్ ఒవైసీ.. రాజకీయాల్లో సరికొత్త ట్విస్ట్!

పాట్నా:బీహార్ రాజకీయ ముఖచిత్రం 2026లో సరికొత్త మలుపు తిరగబోతోంది. రాష్ట్ర రాజకీయాల్లో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బీహార్ నుంచి 5 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కావాల్సిన నెంబర్ గేమ్ ఇప్పుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఏఐఎంఐఎం చుట్టూ తిరుగుతోంది. ఒవైసీ మద్దతు లేకుండా ఐదో సీటును గెలవడం ఏ కూటమికీ సాధ్యం కాదనే పరిస్థితి నెలకొంది. 2026లో జరగబోయే రాజ్యసభ ఎన్నికల్లో ఒవైసీ 'కింగ్ మేకర్'గా అవతరించబోతున్నారనే విశ్లేషణలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.




రాజ్యసభ లెక్కలు.. విజేతకు కావాల్సిన ఓట్లు

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక రాజ్యసభ స్థానాన్ని గెలవాలంటే ఒక అభ్యర్థికి కనీసం 41 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. ప్రస్తుతం అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి 202 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ లెక్కన ఎన్డీఏ నాలుగు స్థానాలను (41 + 4 - 164) సునాయాసంగా గెలుచుకుంటుంది. ఆ తర్వాత ఎన్డీఏ దగ్గర కేవలం 38 ఓట్లు మాత్రమే మిగులుతాయి. ఐదో సీటు గెలవాలంటే వారికి ఇంకా 3 ఓట్లు తక్కువ అవుతున్నాయి. మరోవైపు ఇండియా కూటమి బలం కేవలం 35 ఓట్లు మాత్రమే. వారు ఒక సీటు గెలవాలన్నా వారికి ఇంకా 6 ఓట్లు అదనంగా కావాలి.

కింగ్ మేకర్‌గా ఒవైసీ

ఈ క్రమంలో అసదుద్దీన్ ఒవైసీ పాత్ర కీలకంగా మారింది. బీహార్ అసెంబ్లీలో ఏఐఎంఐఎం పార్టీకి ప్రస్తుతం 5 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒవైసీ తన 5 ఓట్లను ఎన్డీఏకు ఇస్తే, వారు ఐదో స్థానాన్ని కూడా కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేస్తారు. ఒకవేళ ఒవైసీ తన ఎమ్మెల్యేల మద్దతును ఇండియా కూటమికి ఇస్తే (35 + 5 = 40), దానికి తోడు ఒక బీఎస్పీ ఎమ్మెల్యే ఓటు కలిస్తే (41), ఇండియా కూటమి ఒక స్థానాన్ని దక్కించుకునే అవకాశం ఉంటుంది.

ఎవరికి సవాల్?

ప్రస్తుతం పదవీకాలం ముగియనున్న వారిలో ఆర్జేడీ నుంచి ఇద్దరు (ప్రేమ్ చంద్ గుప్తా, అమరేంద్ర ధారి సింగ్), జేడీయూ నుంచి ఇద్దరు (హరివంశ్, రామ్ నాథ్ ఠాకూర్), ఆర్ఎల్ఎం నుంచి ఉపేంద్ర కుష్వాహా ఉన్నారు. 2026 నాటికి ఈ స్థానాలను భర్తీ చేసే క్రమంలో ఒవైసీ ఎటువైపు మొగ్గు చూపుతారనేది ఉత్కంఠగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒవైసీని 'బి-టీమ్' అని విమర్శించిన ఇండియా కూటమి పార్టీలు, ఇప్పుడు ఆయన మద్దతు కోసం ప్రాధేయపడతాయా? లేదా ఎన్డీఏనే తన చాణక్యంతో ఆ ఓట్లు సాధిస్తుందా? అన్నది వేచి చూడాలి. బీహార్ రాజ్యసభ పోరులో ఒవైసీ పాత్ర అనివార్యంగా మారింది. ఇది కేవలం రాజ్యసభ ఎన్నికలకే పరిమితం కాకుండా రానున్న రాజకీయ పరిణామాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# రష్యా ఎస్-500 క్షిపణి వ్యవస్థ.. అమెరికా 5వ తరం ఫైటర్లకు డెత్ బెల్!



రష్యా: రష్యా.. అత్యాధునిక ఆయుధాల తయారీలో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ పెద్దన్నగా చెలామణి అవుతున్న అమెరికా ప్రపంచంలో తామే తోపు అనుకుంటుంది.కానీ రష్యా, చైనా, భారత్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్ అమెరికా టెన్నాలజీని మించి ఆయుధాలు తయారు చేస్తున్నాయి. ఇందుకు రష్యా తాజాగా తయారు చేసిన ఎస్-500 'ప్రమోథీస్' నిదర్శనం. ఈ వాయు రక్షణ వ్యవస్థను పూర్తిగా అమలులోకి వచ్చింది. ఎఫ్-22, ఎఫ్-35 వంటి అమెరికా స్టెల్త్ యుద్ధవిమానాలు, బాలిస్టిక్ మిస్సైళ్లు, హైపర్‌సోనిక్ ఆయుధాలు, లో-ఆర్బిట్ సాటిలైట్లను కూడా లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం ఉందని రష్యా ప్రకటించింది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ వాయు రక్షణ వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది.

అసాధారణ రేంజ్, టార్గెట్ ట్రాకింగ్

ఎస్ - 500 ప్రమోథీస్ 600 కి.మీ దూరంలో ఉన్న మిస్సైళ్లు, డ్రోన్లు, రాకెట్ లాంఛర్లను గుర్తిస్తుంది. స్టెల్త్ టెక్నాలజీని గుర్తించే అధిక రిజల్యూషన్ స్కానర్లు ఉన్నాయి. రాకెట్ వేగంగా టార్గెట్‌ను నాశనం చేసే సాంకేతికత ఉంది. ఎస్-400 కన్నా అడ్వాన్స్ టెక్నాలజీతో ఈ వ్యవస్థ పనిచేస్తుంది. రష్యన్ ఎయిర్ స్పేస్‌ను అభేద్యంగా మార్చింది.

స్టెల్త్ ఫైటర్లకు ఇక దబిడి దిబిడే..

అమెరికా 5వ తరం ఫైటర్లు రాడార్‌లకు తప్పిపోయే స్టెల్త్ డిజైన్‌తో ఉన్నా, ఎస్-500 మల్టీ-ఫ్రీక్వెన్సీ రాడార్లు వాటిని సులభంగా గుర్తిస్తాయి. 2000 కి.మీ./గం వేగంతో వస్తున్న హైపర్‌సోనిక్ మిసైళ్లను కూడా 5 నిమిషాల్లో ఆపగలదు. లో ఆర్బిట్ స్పేస్ అస్ట్రా సాటిలైట్లను కూడా కిందపడేసే సామర్థ్యం ఉంది. ఎస్ - 400, ఎస్ - 500 రష్యా భూభాగాన్ని అణ్వాయుధాలు, డ్రోన్‌లు, క్రూజ్ మిసైళ్ల నుంచి పూర్తిగా కాపాడుతుంది. అమెరికా బీ-21 రాయిడర్ బాంబర్‌లు కూడా ఈ వ్యవస్థకు తట్టుకోలేకపోతాయి.

అమెరికా ఆందోళన..

ఎస్-500 అమలు అమెరికా వాయు సైన్యానికి తీవ్రమైన సవాల్. ఎఫ్-35లు, బీ-2 స్టెల్త్ బాంబర్లు ఇక రష్యా గోడను దాటలేవు. ఇది యుద్ధ వ్యూహాలను మార్చేస్తుంది. స్టెల్త్ టెక్నాలజీపై రష్యా ప్రాధాన్యత పెంచింది. నాటో దేశాలు కూడా ఈ సాంకేతికతను అధ్యయనం చేస్తున్నాయి.ఎస్-500 ఎగుమతి మార్కెట్‌లో భారీ డిమాండ్‌కు దారితీస్తుంది. భారత్, చైనా, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. ఎస్-400 కంటే మెరుగైన ఈ వ్యవస్థ అమెరికా ప్యాట్రియట్, థాడ్ వ్యవస్థలకు పోటీగా నిలుస్తుంది.రష్యా ఎయిర్ డిఫెన్స్ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమం. అమెరికా స్టెల్త్ ఆధిపత్యం చివరి దశలోకి చేరింది.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

హనుమకొండ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ యూనివర్సిటీస్ ఎంప లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కేయూ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

# విధ్వంసానికి కాదు.. అభివృద్ధికి పెట్టుబడులు పెట్టండి: యుఎన్ చీఫ్

యునైటెడ్ నేషన్స్ : ప్రపంచ దేశాధినేతలు విధ్వంసానికి కాకుండా అభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తన నూతన సంవత్సర సందేశంలో సూచించారు. ఈమేరకు అరేబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచి,రష్యా, స్పానిష్ తదితర ఆరు అధికారిక భాషలతోపాటు హిందీ, ఉర్దూ భాషలతో కలిపి మొత్తం 11భాషల్లో ఈ సందేశం అందించారు. కొత్త సంవత్సరం లోకి అడుగుపెడుతున్న మనం ప్రస్తుతం గందరగోళం, అనిశ్చితి పరిస్థితుల్లో ఉన్నామని ప్రపంచంలో నాలుగోవంతు జనాభా జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయని వివరించారు.ప్రపంచ వ్యాప్తంగా 200 మిలియన్ మంది కన్నా ఎక్కువ మందికి మానవతా సాయం అవసరమని, దాదాపు 120 మిలియన్ మంది యుద్ధాలు, సంక్షోభం, ప్రకృతి వైపరీత్యాలు, లేదా పీడన నుంచి బలవంతంగా నిర్వాసితులవుతున్నారన్నారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా సైనిక దళాల కోసం 2024లో 2.7 ట్రిలియన్ డాలర్ల వరకు ఖర్చు



చేయగా, 2035 నాటికి ఈ వ్యయం 6.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే పరిస్థితి ఏర్పడడం విస్మయం కలిగిస్తోందన్నారు.

# ఒకరు ఐఏఎస్.. మరొకరు ఐపీఎస్.. దేశంలోనే సంచలనం ఈ ఘటన!

న్యూఢిల్లీ,వీధి నల్లాల కాడ పంచాయతీలు ఎలా ఉంటాయి చూసేవాళ్ళకు వినోదం.. పంచాయతీలు పెట్టుకునే వాళ్లకు ప్రతీకారం.. మొత్తంగా అదొక యాక్షన్ సినిమా మాదిరిగా ఉంటుంది. కాకపోతే నల్లాల దగ్గర ఆడవాళ్లు మాత్రమే పోట్లాడుకుంటారు. ఎందుకంటే, తమను కాదని వేరే మహిళ ముందుకు వెళితే లేదా అక్రమంగా పెత్తనం సాగిస్తే చూస్తూ ఊరుకోలేరు. చూస్తుండగానే బిందెను లాగి పడేస్తారు. తమ నోటికి పని చెప్పి దుమ్ము దుమారం లేపుతారు.సహజంగానే ఆడవాళ్లకు దూకుడు తత్వం ఎక్కువగా ఉంటుంది. పైగా తమ ఆత్మ గౌరవానికి భంగం కలిగితే ఆడవాళ్లు ఏమాత్రం తట్టుకోలేరు. వీధి పంపు పంచాయతీ కావచ్చు.. అది రాష్ట్ర సెక్రటేరియట్ కావచ్చు.. ఏ మాత్రం తగ్గేది లేదు అన్నట్టుగా పోరాటాలు చేస్తుంటారు. ఈ కథనం ప్రారంభంలో నల్లకాడి పంచాయతీ గురించి చెప్పాం. కానీ సెక్రటేరియట్ స్థాయిలో పనిచేసే మహిళా ఉద్యోగుల గురించి చెప్పలేదు కదా.. అయితే చదవండి ఈ కథనం..అది సరిగ్గా 2023 సంవత్సరం.. కర్ణాటక రాష్ట్రంలో ఐపీఎస్ గా రూప పనిచేస్తున్నారు. అదే రాష్ట్రంలో ఐఏఎస్ అధికారిగా రోహిణి సింధూరి విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో రోహిణి కి సంబంధించిన ప్రైవేట్ ఫోటోలను రూప సోషల్ మీడియాలో షేర్ చేశారు.. అంతేకాదు ఆమెకు ఏకంగా 19 ప్రశ్నలు స్పందించారు. రోహిణి ప్రైవేట్ ఫోటోలను విడుదల చేయడమే కాదు.. వాటికి ట్యాగ్ కూడా జత చేశారు.రోహిణి సింధూరి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారి. ఈమె 2009 కర్ణాటక కేడర్ ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ అధికారి. రోహిణి సింధూరి స్వస్థలం తెలంగాణ. ఈమె గతంలో హసన్, మైసూరు జిల్లాలలో కలెక్టర్ గా పని చేశారు . విధి నిర్వహణలో మొదట్లో సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత వివాదాలలో తరచూ కనిపించారు. హసన్ జిల్లాలో కలెక్టర్గా పనిచేస్తున్నప్పుడు నాటి మంత్రి రేవన్నతో తో సింధూరి గొడవకు దిగారు.అప్పట్లో సిద్ధరామయ్య ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రి మంజు పట్టుబడిన నేపథ్యంలో.. సింధూరి బదిలీ అయ్యారు. అయితే ప్రభుత్వం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆమె హైకోర్టుకు వెళ్లారు. అయితే కోర్టు ఆమె బదిలీపై స్టే విధించింది. రేవన్న మాత్రం వెనక్కి తగ్గకుండా ఆమెను బదిలీ చేయించగలిగారు. మైసూర్ కలెక్టర్గా వెళ్లిన సింధూరికి.. అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శిల్ప నాగ్ తో వివాదం ఏర్పడింది. ఇది కాస్త పెద్దదిగా మారడంతో వారిద్దరిని ప్రభుత్వం బదిలీ చేసింది.మైసూర్ కలెక్టర్ గా ఉన్నప్పుడు సింధూరి రోగులకు సరిపడా ఆక్సిజన్ అందించడం విఫలం కావడంతో.. కరోనా సమయంలో 24 మంది చనిపోయారని చామరాజనగర్ కలెక్టర్ ఆరోపించారు. అంతేకాదు కరోనా నిర్వహణ కోసం ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు



ఆమె అడ్డగోలుగా ఖర్చు చేశారు. అంతేకాదు లంచాలు తీసుకొని మనీ అకౌంట్ రిలీజ్ చేశారని మీడియాలో వార్తలు కూడా వచ్చాయి. మైసూర్ లో కె ఆర్ నగర్ ఎమ్మెల్యే మహేష్ తో సింధూరికి విభేదాలు వచ్చాయి. మహేష్ పై సింధూరి భూముల అక్రమాలకు సంబంధించి మాట్లాడిన ఆడియో అప్పట్లో సంచలనంగా మారింది. దీన్ని మనసులో పెట్టుకున్న మహేష్ ఆమెపై పరువు నష్టం దావా వేశారు. అంతేకాదు చేనేత బ్యాగుల టెండర్లలో 14 కోట్ల అవినీతికి పాల్పడ్డారని మహేష్ ఆరోపించారు.ఇదంతా జరిగిన తర్వాత రోహిణి సింధూరికి సంబంధించిన కొన్ని ప్రైవేటు ఫోటోలను ఐపీఎస్ అధికారి రూప తన ఫేస్బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. " ఇలాంటి ఫోటోలు మీకు సాధారణంగానే అనిపించవచ్చు. కానీ మహేష్ ను కలవడానికి సింధూరి ఎందుకు వెళ్ళింది. డీకే రవితో సింధూరి ఎందుకు చాటింగ్ చేసింది. తన ఫోటోలను ముగ్గురు ఐఏఎస్ అధికారులకు సింధూరి ఎందుకు పంపించింది" ఇలా సోషల్ మీడియాలో రూప ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ నేపథ్యంలో సింధూరి కూడా అదే స్థాయిలో స్పందించింది. రూప పై సింధూరి పరువు నష్టం దావా వేసింది. ఆ తర్వాత ఈ కేసు అనేక రకాల మలుపులు తిరిగింది.కర్ణాటక ప్రభుత్వం వీరిద్దరి వ్యవహారంతో విసిగి వేసారి పోయింది. వారిద్దరినీ బదిలీ చేసింది. ఒకప్పుడు కర్ణాటకలో సంచలన అధికారులుగా పేరుపొందిన వీరిద్దరూ ఇప్పుడు ఎటువంటి ప్రభావం చూపించని శాఖలలో పనిచేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే చిన్నపాటి ఈగోల వల్ల తమ కెరియర్ మొత్తాన్ని నాశనం చేసుకున్నారు. అయితే ఇప్పటికి రూపకు, సింధూరికి ఎక్కడ గొడవ మొదలైంది అనే విషయంపై ఇంతవరకు క్లారిటీ లేదు. ఇప్పుడు అర్థమైందా నల్ల బిందెల కాడ పంచాయతీ.. సెక్రటేరియట్లో జరిగే పంచాయతీ ఒకటేనని.. అది కూడా ఇద్దరు ఆడవాళ్లు తమ అహాలు దెబ్బతింటే ఏ స్థాయిలో పోట్లాడుతారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటా.

# 2026 లో మనదేశం చైనాను అధిగమిస్తుందా?



న్యూఢిల్లీ,2025 సంవత్సరం ముగింపు దశకు చేరుకుంది. గత ఐదు సంవత్సరాలను మనం వెనక్కి తిరిగి చూసుకుంటే, భారతదేశ తయారీ రంగం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు కాగితంపై మాత్రమే ఉన్నవి ఇప్పుడు వాస్తవంగా మారుతున్నాయి.నేడు మీరు చేతిలో పట్టుకున్న ఐఫోన్ భారతదేశంలో తయారు అవుతోంది. ఫోర్డ్ వంటి కంపెనీలు ఇంజిన్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి భారతదేశానికి తిరిగి వస్తున్నాయి. దక్షిణ కొరియా దిగ్గజం LG భారతదేశాన్ని దాని కొత్త నివాసంగా మార్చుకోవాలని ఆలోచిస్తోంది. ఇవి యాదృచ్ఛికం కాదు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రాథమికమైన, లోతైన ఏదో మారుతోందని సూచిస్తున్నాయి. మనం 2026లోకి అడుగుపెడుతున్నప్పుడు, విధాన రూపకర్తల నుండి సాధారణ పెట్టుబడిదారుల వరకు ప్రతి ఒక్కరి మనస్సులో ఒకటే ప్రశ్న. 2026 భారతదేశం నిజంగా చైనా వంటి తయారీ సూపర్ పవర్‌గా మారే మార్గాన్ని ప్రారంభించే సంవత్సరం అవుతుందా?భారతదేశ తయారీ రంగ విజృంభణను అర్థం చేసుకోవడానికి, మనం చైనాను అనుకరించడం మాత్రమే కాకుండా, మన స్వంత మార్గాన్ని రూపొందించుకుంటోంది. చైనా మోడల్ చౌక శ్రమ, భారీ ప్రభుత్వ మద్దతుపై ఆధారపడింది. కానీ భారతదేశం మార్గం భిన్నంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో అతిపెద్ద మార్పు కనిపిస్తుంది. 2025 చివరి నాటికి, భారతదేశం ఇకపై ఆపిల్‌కు అసెంబ్లీ లైన్‌గా మాత్రమే ఉండదు, ఒక ప్రధాన తయారీ కేంద్రంగా మారుతుంది. దీని అర్థం గతంలో భారతదేశానికి రావడానికి వెనుకాడిన విదేశీ సరఫరాదారులు, ఇప్పుడు ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి, కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ మొబైల్ ఫోన్‌లలోని కెమెరా మాడ్యూల్స్, డిస్‌ప్లేలు వంటి చిన్న భాగాలు కూడా ఇక్కడ తయారు చేసినప్పుడు నిజమైన ఆట మొదలవుతుంది. 2026 నాటికి, మనం ఫోన్‌లను అసెంబుల్ చేయడం కంటే కాంపోనెంట్ తయారీకి వెళితే, అది చైనాకు వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బూమ్‌కు నాంది పలికిన క్షణం అవుతుంది.సెమీకండక్టర్లు లేదా చిప్‌లను తయారు చేయడం భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్ణయం... కానీ అత్యంత సాహసోపేతమైన వెంచర్. ప్రపంచ చిప్ కొరత, సరఫరా సిస్టమ్‌ను విచ్ఛిన్నాలు మన స్వంత చిప్‌లను కలిగి ఉండటం ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. 2026లో విజయం మనం ఎన్ని చిప్‌లను ఉత్పత్తి చేస్తాం అనే దాని ద్వారా కాదు, మనం పూర్తి పర్యావరణ వ్యవస్థను సృష్టించామా లేదా అనే దాని ద్వారా ఆధారపడి ఉంటుంది. చిప్ డిజైన్ ఇంజనీర్లు, ముడి పదార్థాల సరఫరాదారులు, వాటిని ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కలిసి పనిచేయడం ప్రారంభిస్తే, భారతదేశం ప్రయత్నాలు విజయవంతమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.బ్యాటరీ తయారీ, అరుదైన-భూమి ప్రాసెసింగ్ కూడా అంతే ముఖ్యమైనవి. అది విద్యుత్ వాహనాలైనా లేదా గృహ సౌర ఫలకాలైనా, శక్తి నిల్వ నేడు చాలా ముఖ్యమైన అవసరం. ఈ రంగాలలో భారతదేశం తన ఉనికిని బలోపేతం చేసుకుంటే, అది చైనాపై మన ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. కొత్త పారిశ్రామిక విప్లవానికి పునాది వేస్తుంది.చైనా విజయగాథలో లక్షలాది మంది రైతులు కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. భారతదేశ పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంది. మన జనాభా యువతరం, కానీ నైపుణ్యాల కొరత ఇప్పటికీ ఒక సవాలుగా ఉంది. ఇంకా, నేటి కర్మాగారాలు రోబోలు, ఆటోమేషన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. దీని వలన మునుపటి మాదిరిగానే ఉద్యోగాలను సృష్టించడం కష్టమవుతుంది. అందువల్ల, ఈ కొత్త కర్మాగారాలు మన యువతకు పెద్ద ఎత్తున ఉపాధిని కల్పించగలవా లేదా అనేది 2026 నాటికి తెలుస్తుంది. కొత్త కార్మిక విధానం, అప్రెంటిస్‌షిప్ పథకాలు ఇప్పుడు నిజంగా పరీక్షించబడతాయి. ఈ కంపెనీలు కేవలం కాంట్రాక్ట్ కార్మికులకు బదులుగా శాశ్వత ఉద్యోగాలను అందించడం ప్రారంభించి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వృత్తి శిక్షణను సమలేఖనం చేస్తే, అది సామాన్య భారతీయుడికి భారీ విజయం అవుతుంది.ప్రపంచవ్యాప్తంగా, భారతదేశానికి కూడా ఒక సువర్ణావకాశం. ప్రపంచం చైనాకు ప్రత్యామ్నాయాల కోసం చూస్తోంది. అమెరికా వంటి ప్రధాన దేశాలతో వాణిజ్య ఒప్పందాలు దాదాపు ఖాయమయ్యాయి. ఈ ఒప్పందాలు భారతీయ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరుస్తాయి. 2026 మనం రాత్రికి రాత్రే "తదుపరి చైనా"గా మారే సంవత్సరం కాకపోవచ్చు. కానీ భారతదేశం దాని స్వంత నిబంధనల ప్రకారం.. దాని స్వంత వేగంతో బలమైన, స్వావలంబన తయారీ శక్తి కేంద్రంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే సంవత్సరం కావచ్చంటున్నారు ఆర్థిక విశ్లేషకులు.

# జగన్ ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్

ఒంగోలు, జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఓ దగాకోరు అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం, ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. దీనికి జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన అహంభావి అన్నారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com